కథ

# మనుజుడై పుట్టి

- భమిడిపాటి సోమయాజి

**ఆరోజు కూడా యింటికి రావటం ఆలస్యం అవుతుందని రెండోసారి కాఫీ తాగి యింటి నుండి బయల్దేరాడు సత్యమూర్తి.**

"ఇంటికి రావడం ఆలస్యమైతే మాత్రం ఎక్కడైనా టిఫిన్ చెయ్యండి" అలవాటుగా చెప్పింది అతని భార్య సుగుణ.

"ఆమెకేం చెపుతుంది ! డబ్బులు సరిపోవద్దూ ! అవతల ముసలి తల్లిదండ్రులు ! పెళ్ళికి ఉన్న చెల్లెలు. ఇన్ని బాధ్యతలు ఉన్నవాడ్ని టిఫిన్ ఏం తింటాను !" అనుకున్నాడు సత్యమూర్తి.

ఉద్యోగం ప్రయత్నంలో కలవని మానవ మాత్రుడు లేడు ! వాళ్ళు చేసిందీ ఏం లేదు ! సరే ! ఆఖరి ప్రయత్నంగా మౌళిగార్ని ఆశ్రయించాడు. ఆయన ఏ రోజు రమ్మంటే ఆరోజు విడవకుండా కలసి చేతులు జోడించి ఆయన ముందు నిలుస్తున్నాడు ! ఏం చేస్తాడు పాపం ఏ రోజైనా ఆయన ఉద్యోగం వేయించేస్తాడని ఆశ ! ఆశలేనిదే మనిషి బ్రతకలేడు ! అతన్ని చూడగానే మాట్లాడలేదు మౌళి.

తన అటెండర్ని పిలిచి "ఏమిటయ్యా ! ఈగది శుభ్రంగా తుడిచినట్లు లేదు, యిందాకా నేను బయటకు వెళ్ళినపుడు ఏమైనా ఫోన్లు వచ్చాయా" అని రకరకాల ప్రశ్నలతో ఆయన గొప్పతనం తెలియపరుస్తూంటాడు.

''ఒర్చినమ్మకు తేటనీరు'' అని సత్యమూర్తి బామ్మగారు అనేది. ఆ మాటలు గుర్తుకు తెచ్చుకుని ఓర్పుగా వేచియుండేవాడు మూర్తి.

సరే ! మౌళి గార్కి యిసుమంత దయ కలిగి "ఆ-నిన్న సాయంకాలం నుంచి సార్‌తో మీ విషయం చెపుదామని ప్రయత్నం చేసానండి. కాని సార్ చాలా బిజీగా ఉన్నారు. రాత్రి తొమ్మిది గంటల వరకు యిద్దరం ఆఫీసులోనే ఉన్నాం. కలసి కాఫీ కూడా తాగాం.

"ఆ అన్నట్టు "ఒక చిన్న విషయం" అన్నాడు మౌళి. పని అయ్యేలా ఉంది అనుకుంటూ మౌళి కేసి ఆత్రంగా చూసాడు మూర్తి.

"రేపు చూద్దాం లేవయ్యా" అన్నారు సార్. "ఆయన మూడ్ లేనప్పుడు చెప్తే వ్యవహారం బెడిసి కొడుతుందేమో అన్న భయంతో యింక ఆ ప్రస్తావన చెయ్యలేదు. రెండు మూడు రోజుల్లో తప్పక చెప్పి ఉద్యోగం ఏర్పాటు చేద్దాం" అన్నారు మౌళిగారు.

ఇక చేసేదేముంది. "సరే సార్ ! దయచేసి మీరు తప్పక ఈ సహాయం చెయ్యాలి. నా బాధలు మీకిదివరకే విశదంగా విన్నవించుకున్నాను కదా'' అని శెలవు తీసుకున్నాడు మూర్తి.

ఉదయం తొమ్మిది గంటలకు బయల్దేరిన తను యింటి కొచ్చేసరికి మధ్యాహ్నం ఒంటి గంటయింది.

సరే ! భార్యామణి ముకుళిత హస్తాలతో దేవుడికి దండం పెట్టుకుంటూ అడిగింది. "ఏమండీ ! పని అయిందా" అని.

"ఇంకా లేదు" అని నీరసంగా జవాబు యిచ్చాడు తను.

నాలుగు రోజులు వ్యవధి యిచ్చి మళ్ళీ కలిసాడు మౌళిగార్ని. సరే ! పాత తంతే అంతా.

"మీకెందుకు నేను చేస్తాను కదా" అని ఆశ కలిగించి పంపించి వేసాడు మౌళి. పని అవదు. అవుతుందో అవదో నిర్ధారణగా చెప్పడు. ఉన్న కాస్త డబ్బు దారి ఖర్చులకే అయిపోతోంది. ఆరోజు కూడ నిరుత్సాహంతో యింటికి వచ్చేసాడు మూర్తి. ఇంటికి వచ్చేసరికి తన భార్య మేనమామ హనుమత్ శాస్త్రిగారు కనిపించారు.

"ఏమయ్యా ! కులాసానా ! ఏమిటో ఏదో ఆదుర్దాగా కనిపిస్తున్నావు. ఎక్కడైనా ఉద్యోగం వచ్చిందా" అని కుశల ప్రశ్నలు వేసారు.

చుట్టం చూపుగా వచ్చినాయనకు తన గోడంతా చెప్తే బాగుండదని "ఆ ప్రయత్నంలోనే ఉన్నానండి. నాలుగు నెలల నుంచి ఒకాయన్ని ఆశ్రయిస్తున్నాను. పని జరగవచ్చని" చెప్పాడు మూర్తి.

"ఏదైనా మనస్ఫూర్తిగా ఒక పని చెయ్యాలంటే నాలుగు నెలలు ఎందుకయ్యా నిన్ను అనవసరంగా తిప్పుతున్నారనమాట". ఈ మాటలు నిజమే అనిపించాయి మూర్తికి.

"ఒకమనిషి చుట్టూ నాలుగు నెలలు తిరగడం కంటే, నలభై రోజులు "సుందరకాండ" పారాయణ చెయ్యడం మంచిది. ఏపనేనా అవుతుంది. అంతెందుకు ? పదహారు రోజుల పారాయణ ఒకటి ఉన్నది. "రాఘవం విజయం దద్యాన్మయ సీతాపతిః ప్రభుః" అనే అక్షరాలను బట్టి, రోజుకి యిన్ని సర్గలు పారాయణ నిర్దేశించారు. నియమబద్ధంగా ఆ విధంగా చేస్తే తప్పక విజయం లభిస్తుంది" అని చెప్పారు శాస్త్రిగారు.

"పారాయణ విధానం పూర్తిగా ఈయనకి చెప్పు మామయ్యా" అని వాళ్ళింట్లో ఉన్న సుందరకాండ పుస్తకం తెచ్చి యిచ్చింది సుగుణ.

ఆ పుస్తకం తీసుకొని శాస్త్రిగారు "ఎన్నిరోజులు తిరిగినా మానవుడు చెయ్యని, చెయ్యలేని పనిని దేవుడ్ని చిత్తశుద్ధితో ప్రార్థిస్తే సులువుగా అవుతుంది. అందుకనే "చిత్తమందు నిన్ను చూచు సౌఖ్యమే ఉత్తమంబనుచు ఉప్పొంగితిని" అన్నారు త్యాగరాజస్వామి" అంటూ కళ్ళు మూసుకున్నారు శాస్త్రిగారు.

''బహుశః రాముల వారిని తన చిత్తంలో చూస్తున్నారు కాబోలు శాస్త్రిగారు" అనుకున్నాడు సత్యమూర్తి.

"పారాయణ విధానం సవిస్తరంగా చెప్పి, దేవుడిపై పూర్తి విశ్వాసంతో తారాబలం చూసుకుని పారాయణ ప్రారంభించు'' అని చెపుతున్న శాస్త్రిగారితో ఆంజనేయస్వామి సాక్షాత్కరించినట్లయింది మూర్తికి. ఆ మర్నాడు శాస్త్రిగారు తన స్వగ్రామానికి వెళ్ళిపోయారు.

శాస్త్రిగారు చెప్పిన విధంగా పదహారు రోజుల పారాయణ పూర్తి చేసాడు మూర్తి.

ఒకరోజు మూర్తి ఎక్కడికో నడిచి వెడుతూంటే, తన పాత మిత్రుడు హనుమత్ వర ప్రసాద్ కనిపించాడు. మూర్తిని గుర్తు పట్టి తన కార్లో హోటల్ కృష్ణా ఒబేరాయ్‌కి తిసుకువెళ్ళాడు. ప్రసాద్, తనూ ఎం.బి.ఎ.లో క్లాస్‌మేట్స్. ప్రసాద్ ఏదో పెద్ద కంపెనీలో జనరల్ మేనేజర్‌గా ఉన్నట్లు యిదివరలో ఎవరో ఫ్రెండ్ ద్వారా విన్నాడు మూర్తి.

ఇద్దరూ హోటలు లోపలికి వెళ్ళారు. అతిపెద్ద ఏ.సి. రూమ్. రూమ్‌కే కాఫీ తెప్పించాడు ప్రసాద్.

"ఏం చేస్తున్నావు ? ఏమిటి పిల్లలా" అని కుశల ప్రశ్నలు వేసాడు ప్రసాద్.

సరే ! తన బాధ్యతలు, ఉద్యోగాన్వేషణ గురించి చెప్పాడు.

"అదేమిట్రా ఏదో మంచి ఉద్యోగంలో ఉండి ఉంటావు అనుకున్నాను. బయోడేటా ఒకటి నాకియ్యి. ఈ రోజు సాయంకాలం ఎగ్జిక్యూటివ్ పోస్టులకి ఇంటర్యూలు

చేస్తున్నాం. ఇంకొక యిద్దరు కూడా మా కంపెనీ నుంచి వస్తారు" అన్నాడు ప్రసాద్.

ఆరోజు సాయంకాలం మూర్తి ఇంటర్వ్యూకి వెళ్లాడు. పదిహేనురోజుల తర్వాత మంచి జీతం మీద మూర్తికి ఉద్యోగం వచ్చింది.

ఎన్నిరోజులు శ్రమపడినా దొరకని ఉద్యోగం సుందరకాండ పారాయణ చేసిన తర్వాత దొరికింది. ఇందులో ఇంత మహాత్యం ఉంది కదా అని మురిసిపోయాడు మూర్తి. ఆ పారాయణ మాత్రం మానలేదు.

ఒకరోజు మూర్తి యింటికి వచ్చేసరికి టీ.వి.లో అన్నమాచార్య కీర్తనలు వస్తున్నాయి. ప్రోగ్రామ్ చివరికి వచ్చినట్లున్నది. "త్వమేవ శరణం, త్వమేవ శరణం" అన్న కీర్తన తర్వాత "మనుజుడై పుట్టి, మనుజుని సేవించి అనుదినము దుఃఖమందనేల" అనే కీర్తనతో ప్రోగ్రామ్ ముగిసింది. ❃

# మాతృదేవోభవ

అమ్మా జన్మ నిచ్చితివి ముద్దు బిడ్డలకు నీవు
రత్నములుగా తీర్చిదిద్దితివి ప్రయోజకులుగ అమిత వాత్సల్యముతోన
నీ శ్రమలే ఈనాటి మా ఉన్నత పదవికి కారణాలు
ఆశించలేదు నీవెన్నడు అనిత్యభాగ్యములు
ఎల్లవేళల నిలిచె నీ హృదయమున భక్తి స్థిరముగ
పరుల సేవలు చేసితివి పరమార్థమునకొరకు
వ్యాధులు నిన్నావరించిన వేళ
అందుకొంటివి మా సేవలు తృప్తి చెందగ
మా సేవలేపాటి నీ వాత్సల్యమును పోల్చి
భీష్ముని పగిది ఉత్తరాయణంబు నీ ప్రయాణంబు
తీర్చుకుంటివి భువిలోని ఋణములన్నియు ముందె
జన్మరాహిత్యమ్ము పొందుటకు మరుజన్మలేకుండ
మరుజన్మ ఉన్న జన్మించాలని ఉంది నీ గర్భమున నే మళ్ళీ మళ్ళీ
ఏమిచ్చి నీ ఋణం తీర్చుకుందుము తల్లి
అర్పింతుము మా నమస్సుమాంజులు అశ్రువులతో
అందుకో తల్లి ఆకసము నుండి నీవు కురిపించు నీ దీవనజల్లు నీ బిడ్డలపై
ఇంతలో భూమాత ప్రశ్నించె
అంతటి మాతృమూర్తి ఈ భువిలోనగలదె

(అశ్రు నయనాలతో .... అమ్మకు అంకితం)

– కె. లలితాదేవి